

గొంతెండుతోంది!

జిల్లాలోని పలు మండలాల్లో ప్రజలు తాగునీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



సైబర్ మోసాలపై..

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ పార్వతి సూచించారు. 8లో▸



యథేచ్ఛగా మట్టి దందా!

ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి దందా కొనసాగిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు కొడంగల్‌కు మంత్రి పొంగులేటి రాక

కొడంగల్: రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం కొడంగల్‌కు రానున్నారు. తెలంగాణ భూ భారతి ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా మూడు మండలాల్లో ప్రవేశపెట్టనున్నారు. అందులో ఒకటి కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం ఉంది. కాజీపూర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా భూ భారతి పోర్టల్‌ను మంత్రి పొంగులేటి గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి హాజరుకానున్నారు.

కరణం పురుషోత్తంరావుకు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న కరణం పురుషోత్తం రావు

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, రాజకీయ, సామాజిక వేత్త కరణం పురుషోత్తం రావుకు నంది అవార్డు లభించింది. బుధవారం హైదరాబాద్‌లో ఉజ్వల సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించిన ఉగాది నంది పురస్కారాల ప్రదానోత్సవంలో కరణంకు అవార్డు దక్కింది. 42 సంవత్సరాలుగా రాజకీయ నాయకునిగా, సామాజిక వేత్తగా సేవలందించినందుకు గాను నంది పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రాజకీయ, సామాజిక సేవా కార్యక్రమాలకు గాను అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని పేర్కొన్నారు. పురుషోత్తం రావును పలువురు రాజకీయ నాయకులు, పట్టణ వాసులు అభినందించారు. కార్యక్రమంలో ఉజ్వల సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షురాలు ఎం లక్ష్మి, దైవజ్ఞశర్మ, ప్రజాపతి, పార్థసారథిరెడ్డి, బాలరాజ్, శ్రీలత పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

జిల్లా పశువైద్యాధికారి సదానందం



నవాబుపేటలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

నవాబుపేట: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి సదానందం సూచించారు. బుధవారం మండలంలోని ఎల్లకొండ, చిట్టిగిద్ద, నవాబుపేట గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మే 15తేదీ వరకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ విశ్వనాథ్, సిబ్బంది శ్రీరాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కళ్ల సంరక్షణపై జాగ్రత్తలు అవసరం

- డీఎంహెచ్ఓ వెంకటరవణ
- విద్యార్థినులకు కంటి అద్దాల పంపిణీ



విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్కూల్ ఐ స్క్రీనింగ్‌లో భాగంగా కంటి లోపం ఉన్న విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ వెంకటరవణ తెలిపారు. బుధవారం వికారాబాద్‌లోని కేజీబీవీలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సంరక్షణ చాలా ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి కళ్లను కాపాడుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 69,201 విద్యార్థులకు కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో 55 మంది పిల్లలకు శస్త్ర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు పంపినట్లు వివరించారు. 3,088 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.ప్రతి ఏటా కంటి పరీక్షలు చేయించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మంచి ఆహారం, స్వచ్ఛమైన నీటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జీవరాజు, డాక్టర్లు బుచ్చిబాబు, ప్రవీణ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, స్వామినాథ్, ఆర్‌బీఎస్‌కే బృందం పాల్గొన్నారు.

అకాల వర్షం..ఆగమాగం!



ఊరెంటి తండాలో వడగండ్ల వాన

గంటపాటు తీవ్ర గాలులతో కూడిన వడగండ్ల వాన

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, చెట్లు, తెగి పడిన తీగలు
- మూడు గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిపివేత

తాండూరు రూరల్/మోమిన్‌పేట: అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఒక్కసారిగా గాలివాన, వడగండ్ల వర్షం భయపెట్టింది. గంటపాటు తీవ్ర గాలులు వీచాయి. పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు నేలకొరిగాయి, గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. పెద్దేముల్ మండలం అడికిచెర్ల, ఊరెంటితండా, బాయిమీది తండాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన, వడగండ్ల వర్షం పడింది. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. తట్టేపల్లి 11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను ఆపేశారు. రతన్‌సింగ్ రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నెలకొరిగింది. మూడు స్తంభాలు పడిపోయాయి. అధికారులు కరెంట్ సరఫరాను ఆపేశారు. గురువారం ఉదయం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. మోమిన్‌పేట మండలంలో బుధవారం ఒక్కసారిగా ఈదురుగాలులు వీచాయి.





ఊరెంటి తండాలో నెలకొరిగిన చెట్టు, అడికిచెర్ల గ్రామ సమీపంలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

- దశల వారీగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిగి మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించామని పేర్కొన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు దశల వారీ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఎక్కడ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం కూడా కట్టించిన పాపాన పోలేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఏడాది పాలనలోనే పేదోడి సొంతింటి కళను నెరవేరుస్తున్నారని అన్నారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి పట్టణంలోని బీసీ వసతి గృహానికి వెళ్లారు. అక్కడి సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు శ్రీను, తౌర్యానాయక్ పాల్గొన్నారు.

కేంద్రం కుట్రలు మానుకోవాలి

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి హితవు పలికారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, అగ్రనేత రాహుల్ గాంధీ పేర్లను నేషనల్ హెరాల్డ్ కేసులో చేర్చడంపై ఆయన మండిపడ్డారు. పార్టీ పిలుపు మేరకు బుధవారం వికారాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్‌లో చేర్చడం ముమ్మాటికీ ప్రతీకారమే అన్నారు. ప్రధాని మోదీ కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, నర్సింలు, సురేందర్, కృష్ణ, రమేష్‌కుమార్, ముత్తాహర్ షఫీఫ్, మాజీ కౌన్సిలర్లు మురళీ, వేణుగోపాల్‌రెడ్డి, రెడ్యానాయక్, ఆసీఫ్, శ్రీనివాస్, జంగయ్య, యాదయ్య, నర్సింలు, మధుకర్, ఉస్మాన్, ఖలీద్, నిఖిల్‌రెడ్డి, అశోక్, రహీం, మథిన్ తదితరులు పాల్గొన్నారు.



చిలుముల మైల్వార్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్‌రెడ్డి, జయకృష్ణ

దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ

దుద్యాల్: ఆరుగాలం కష్టించి పండించిన పంటలను దళారులకు అమ్మి నష్టపోరాదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి, మెట్లకుంట పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని పోలేపల్లి, చిలుముల మైల్వార్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళారులు ఎక్కువ ధర ఆశచూపి తూకంలో మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. క్వింటాలు ఏ - గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు జ్యోతి, మాణిక్య శ్రీ,, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వెంకటయ్య గౌడ్, నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణపూర్‌లో హెచ్‌డీసీసీబీ శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బ్యాంక్ సేవలను విస్తరిస్తాం

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- లక్ష్మీనారాయణపూర్‌లో హెచ్‌డీసీసీబీ బ్రాంచ్ ప్రారంభం

యాలాల: మారుమూల ప్రాంతాల రైతులకు సైతం హెచ్‌డీసీసీబీ సేవలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీనారాయణపూర్‌లో హెచ్‌డీసీసీబీ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాను డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఇక్కడ బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు గుర్తుచేశారు. రైతుల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని సొసైటీల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2020 నాటికి డీసీసీబీ టర్నోవర్ రూ.600 కోట్లు ఉండగా.. ప్రస్తుతం రూ.2 వేల కోట్లకు చేరిందన్నారు. సొసైటీల్లో పని చేస్తున్న ఉద్యోగుల భద్రత కోసం పోరాటం చేసి జీఓ 44ను సాధించినట్లు తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 3 వేలకు పైగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం జరిగిందన్నారు. సొసైటీల ఆధ్వర్యంలో గోదాంలు, రైస్ మిల్లులు, కోల్డ్ స్టోరేజీలు, ఫంక్షన్ హాళ్లు తదితర వాటికి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. లక్ష్మీనారాయణపూర్ బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరో మూడు శాఖల ఏర్పాటుకు కృషి

హెచ్‌డీసీసీబీ ఆధ్వర్యంలో తాండూరు నియోజకవర్గంలో మరో మూడు బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బషీరాబాద్, పెద్దేముల్, కరణ్‌కోట గ్రామాల్లో కొత్తగా శాఖలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్యయ్య, మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, డైరెక్టర్లు రాజు, మొగులయ్య, వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ భీమప్ప, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్ బాబా, నాయకులు సత్యనారాయణరెడ్డి, రఘు, లక్ష్మీకాంత్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్లు మనోహర్‌రావు, తిరుపతయ్య, అసిస్టెంట్ మేనేజర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

దివ్యాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

దోమ: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని దివ్యాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ కోరారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తమకు అనేక హామీలు ఇచ్చిందని, ఏడాది పాలన పూర్తయినా అమలు చేయడం లేదని ఆరోపించారు. దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారని.. వారికి అవకాశం కల్పించాలని అన్ని పార్టీలను కోరారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తాన్ని రూ.6 వేల పెంచాలని కోరారు. అలాగే ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, దివ్యాంగుల సంక్షేమ శాఖ, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. లేని పక్షంలో సీఎం సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి నుంచి నిరసన పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

సన్నబియ్యంపై అసత్య ప్రచారం చేస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

అనంతగిరి: రేషన్ దుకాణాల్లో పంపిణీ చేస్తున్న సన్నబియ్యంపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని ప్రజలు నమ్మరాదని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సన్న బియ్యంలో ప్లాస్టిక్ బిల్డింగ్ ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. ప్రజలను భయాందోళనకు గురి చేసేందుకు కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. గోదావరిఖని పెద్దపల్లి జిల్లాలోని తిలక్ నగర్‌లో రేషన్ షాపులో సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిశాయని ప్రచారం చేసిన వారిపై అక్కడి అధికారులు కేసు నమోదు చేసినట్లు లిపారు.

పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించండి

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారంలో గల స్వామీ వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (బాలుర వసతి గృహం) పాఠశాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ రికార్డులను పరిశీలించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారాని అని ఆరా తీశారు. ప్రతి నెలా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ జయసుధ తదితరులు ఉన్నారు.



చైల్డ్ కేర్ వసతి గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

రేషన్ షాపులో తనిఖీలు

పూడూరు: మండలంలోని గొంగుపల్లి రేషన్ షాప్‌ను బుధవారం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసి సన్నబియ్యం పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, డీఎస్ఓ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మూన్‌వాకర్ వంశీపై డాక్యుమెంటరీ

త్వరలో ఇండియా టీవీ చానల్‌లో ప్రసారం



వంశీకృష్ణ

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన మూన్‌వాకర్ వంశీకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. త్వరలో ఇండియా టీవీ చానల్‌లో ఆయన డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. దివంగత ప్రముఖ డాన్సర్ మైఖేల్ జాక్సన్ మూన్ వాక్ రికార్డును బద్ధలు కొట్టి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఇండియా టీవీ ఆధ్వర్యంలో దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖుల జీవిత చరిత్రను ఆరు నిమిషాల పాటు డాక్యుమెంటరీ రూపంలో ఇవ్వనున్నారు. ఈ మేరకు వంశీకృష్ణకు సదరు చానల్ నుంచి మెయిల్ ద్వారా సందేశం అందింది. ఈ అరుదైన అవకాశం తాండూరు వాసికి దక్కినందుకు పలువురు ఆయనను అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

- మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్‌రాజు



మాట్లాడుతున్న మైనింగ్ అధికారులు

తాండూరు టౌన్: మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించే వారి అనుమతులను రద్దు చేస్తామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్‌రాజు అన్నారు. పట్టణంలోని మైనింగ్ శాఖ కార్యాలయంలో ఏడీ సత్యనారాయణతో కలిసి బుధవారం లీజుదారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో సుద్ద తవ్వకాలకు అనుమతులు పొందిన లీజుదారులు నిబంధనల ప్రకారమే తవ్వకాలు చేపట్టాలన్నారు. 2011నుంచి 2025 వరకు 22 మందిపై పెనాల్టీలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ఆరుగురు మాత్రమే అపరాధ రుసుంలు చెల్లించారని, మిగిలిన 16మంది రూ.1.06 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి మైనింగ్ శాఖ జిల్లాకు రూ.151 కోట్ల టార్గెట్ ఇచ్చిందని, ఇందులో రూ.133 కోట్ల ఆదాయం వచ్చిందని డీడీ తెలిపారు.



క్లుప్తంగా

వాటర్ లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి నీటి సరఫరాలో శాశ్వతంగా లో-ప్రెషర్ సమస్యను పరిష్కరించేందుకు వాటర్ లైన్‌మెన్లపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. ఏకంగా ఎండీ అశోక్ రెడ్డి లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. తాజాగా బుధవారం డివిజన్ 18 పరిధిలోని లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఒక్కో లైన్‌మెన్ ఎన్ని వాల్వ్‌లను ఆపరేట్ చేస్తారో వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు ఎలా చేయాలో చర్చించారు. ప్రతి లైన్‌మెన్ ఆ. దీనంలో ఉన్న ఆపరేషన్ వాల్వ్‌ల సంఖ్య, నీటి సరఫరా చేసే క్యాన్ నంబర్లు, వాల్వ్ ఆపరేషన్ సమయాన్ని తగ్గించడం తదితర అంశాలపై లైన్‌మెన్లతో చర్చించారు. వీటితోపాటు మెట్రో కస్టమర్‌లో నమోదయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను జీఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ జూమ్ మీటింగ్‌లో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ- డైరెక్టర్ ఆపరేషన్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, జీఎం, డీజీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు

బైకును ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

భార్య మృతి..భర్తకు గాయాలు

మాదాపూర్: వాటర్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన శ్రీకాంత్ కుమార్ భార్య మనీషా కుమారితో కలిసి బుధవారం ఉదయం బైక్‌పై పర్వత్ నగర్ నుంచి మైహోంభుజ అపార్ట్‌మెంట్‌కి వెళ్తుండగా..సైబర్ టవర్ ఎంట్రీ గేట్ వద్ద ఓ వాటర్ ట్యాంకర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరు బైక్‌పై నుంచి పడిపోగా మనీషాకుమారి పైనుంచి వాటర్ ట్యాంకర్ వెళ్లడంతో తీవ్రగాయాలై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీకాంత్ కుమార్ తల, చేతులకు స్వల్పగాయాలయ్యాయి. నిర్లక్ష్యంగా నడిపిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను కె.శ్రీనివాస్‌గా గుర్తించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోపంతోనే వృద్ధురాలిని చంపేశాడు..

- కమలాదేవి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- జువైనల్ హోంకు మైనర్ తరలింపు

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్ రోడ్డు నెంబరు-5లో చోటు చేసుకున్న కమలాదేవి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమె తిడుతుందనే కోపంతో కసి పెంచుకున్న మైనర్ బాలుడే ఆమెను హత్యచేశాడని, ఇందులో ఎలాంటి కుట్రకోణం లేదని తేల్చారు. నిందితుడితో పాటు హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్ షాప్ యజమానులు ప్రకాష్‌చౌదరి, లలిత్‌చౌదరిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని సుదీర్ఘంగా విచారించారు. సీసీ పుటేజీలతో పాటు వారి కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు చివరకు బాలుడే కమలాదేవిని హత్య చేసినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు అతన్ని జువైనల్ హోంకు తరలించారు. ఈ విషయాలను బుధవారం కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. విషయం వెల్లడవడంతో పారిపోయేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి ట్రైన్ కోసం వేచి చూస్తున్న మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. కమలాదేవిని హత్య చేసిన విషయాలను బాలుడు వెల్లడించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. మేడ్చల్ కోర్టులో హాజరు పరిచిన అనంతరం అతడి వద్ద నుంచి రక్తపు మరకల దుస్తులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

పరువు నష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు : తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జునతోపాటు ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడంతో వారి తరుపున న్యాయవాదులు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. సినీ అగ్రహీరో నాగార్జున కుమారుడు హీరో నాగచైతన్య-సమంత విడాకుల విషయంపై కేసు నమోదైన విషయం విదితమే.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఫామ్ హౌస్‌లో పనిచేయుటకు వ్యవసాయం తెలిసిన భార్యాభర్తలు కావలెను. రూమ్ ఇవ్వబడును. కల్వకుర్తి గట్టు ఇప్పలపల్లి నెలకు జీతం 15వేలు. 7382532031 [HA-1312]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ:18k Ph: 9640400073, 9160900024 [SCA25002716]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గొంతెండుతోంది!

- పలు గ్రామాల్లో తాగునీటి సమస్య
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అల్లిఖాన్‌పల్లిలో తాగునీటి కోసం క్యూ కట్టిన జనం

దౌల్తాబాద్: పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ రెండు వైలకు పైగా జనాభా ఉంది. మూడు నెలలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. పంచాయతీకి సంబంధించిన సింగిల్ ఫేజ్ బోర్లలో నీళ్లు తగ్గాయి. గ్రామ సమీపంలో ఉన్న మరో సింగిల్ ఫేజ్ మోటారు కాలిపోయి ఐదు రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి కోసం క్యూ కట్టిన జనం

దుద్యాల్: మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లిలో తాగునీటి కోసం స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. రెండు రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తాగునీటి కోసం జనం క్యూ కడుతున్నారు. బుధవారం సాయంత్రం నీటికోసం క్యూ కట్టిన దృశ్యాలు కనిపించాయి. అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటికి అంతరాయం ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కాశీంపూర్‌లో నీటి ఎద్దడి

బషీరాబాద్: మండల పరిధిలోని కాశింపూర్ గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో వారం రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ మేరకు బుధవారం గ్రామస్తులు నిరసన వ్యక్తంచేశారు. అనంతరం మాట్లాడుతూ.. తమ సమస్యను గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బోరు వేయించి, మోటార్ ఇప్పించారని తెలిపారు. కేవలం మోటారు బిగించి, విద్యుత్ కనెక్షన్ ఇస్తే సరిపోతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.



సుల్తాన్‌పూర్‌లో బిందెల వరుస



కాశీంపూర్‌లో బోరుమోటారు వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు

క్యూలైన్‌లో నిలబడుతున్నా



వృద్ధురాలినైన నేను కూడా బోరు వద్దకు వెళ్లి, లైన్‌లో నిలబడి నీళ్లు పట్టుకోవాల్సి వస్తోంది. చాలా రోజులుగా నీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎండాకాలం కావడంతో ఎక్కువ నీళ్లు అవసరం అవుతున్నాయి.

– దేవమ్మ, సుల్తాన్‌పూర్, దౌల్తాబాద్ మండలం

అధికారుల నిర్లక్ష్యం



మూడు నెలలుగా తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోంది. సింగిల్ ఫేజ్ మోటారు రిపేర్ చేయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

– అశోక్, సుల్తాన్‌పూర్

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ పార్వతి, కళాజాత బృందం సభ్యులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ పార్వతి పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలోని ఎస్‌బీఐ ఎదుట కళాజాత నిర్వహించారు. సైబర్ నేరాలు, ఓటీపీ మోసాలు, తదితర బ్యాంకింగ్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేస్తే స్పందించొద్దన్నారు. మీకు లోన్ ఇస్తామని అందుకు కొంత డబ్బులు అకౌంట్లో జమ చేయాల్సి ఉంటుందని, మీ నంబర్ లక్కీడ్రాలో ఎంపిక అయ్యిందని వివిధ మోసపూరిత మాటలతో నమ్మబలికేవిధంగా మాట్లాడితే అలాంటి ఫోన్ కాల్స్‌కి సమాధానమియొద్దన్నారు. మోసపూరితమైన మాటలు నమ్మితే ఆర్థికంగా నష్టపోతారని హెచ్చరించారు. ఏదైనా అనుమానం ఉంటే బ్యాంకుకు వచ్చి తమతమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింహా రెడ్డి, కిరణ్‌కుమార్, సత్యకుమార్, కటికె శ్రీనివాస్‌లు, కృష్ణచారి, నర్సింలు, సత్యం, విజయ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులు ఆందోళన చెందొద్దు

- తాండూరు ఎస్‌బీఐలో తాత్కాలిక లావాదేవిల కార్యకలాపాలు
- వివరాలు వెల్లడించిన బ్యాంక్ మేనేజర్ భువన్ మోహన్



మాట్లాడుతున్న భువన్ మోహన్

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ సమీపంలోని సీసీఐ టౌన్‌షిప్‌లో ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో ఖాతాదారులు ఎవరూ కూడా ఆందోళన చెందొద్దని బ్యాంక్ మేనేజర్ టి.భువన్ మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం బ్యాంక్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా కాలిపోయిందన్నారు. బ్యాంక్‌లో 6 వేల మందికి సంబంధించిన ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం కరన్‌కోట్‌లోని బ్యాంక్‌లో కార్యకలపాలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. కావున బ్యాంక్ ఖాతాదారులు లావాదేవిలకు సంబంధించి తాండూరు పట్టణంలోని శాంత్ మహల్ వద్ద ఎస్‌బీఐ (ఏడీబీ)లో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా కరన్‌కోట్ గ్రామంలో కస్టమర్ సర్వీస్ పాయింట్(సీఎస్‌పీ)లో కూడా ఖాతాదారులు నగదు డిపాజిట్లు, ఉపసంహరణ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రుణాల ప్రక్రియ తాత్కాలిక నిలిపివేత

ప్రస్తుతం బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం వలన కంప్యూటర్లతో పాటు ఫర్నిచర్ పూర్తిగా కాలిపోవడంతో ఖాతాదారులకు పంట రుణాలు, గోల్డ్‌లోన్, పర్సనల్‌లోన్‌కు సంబంధించి ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేశామని బ్యాంక్ మేనేజర్ భువన్ మోహన్ తెలిపారు. వారం రోజుల్లో రోజువారి బ్యాంక్ లావాదేవిలకు సంబంధించి కార్యకలపాలు పునరుద్ధరిస్తామన్నారు.

సీఎం ఇలాఖాలో ప్రగతి 'బాటలు'

రూ.58.99కోట్ల నిధులతో డబుల్ రోడ్లకు శంకుస్థాపనలు



బొంరాస్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో పల్లెలు, గిరిజన తండాలు, గల్లీలు సైతం అభివృద్ధి పనులతో ప్రగతి పట్టాయని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంఛార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మెట్లకుంట, బురాన్‌పూర్, బొంరాస్‌పేట, ఏర్పుమళ్ల, చౌదర్‌పల్లి గ్రామాలకు రూ.కోట్ల నిధులతో డబుల్ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడంగల నియోజకవర్గం పట్ల సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. చౌదర్‌పల్లి, నాందార్‌పూర్ - ఏర్పుమళ్ల, ఏర్పుమళ్ల - బుద్లాపూర్, బొంరాస్‌పేట - నాగారం, బొంరాస్‌పేట - బుర్రితండా, మెట్లకుంట - లోతికుంటతండా, బొంరాపేట - తుంకిమెట్ల డబుల్ రోడ్డు నిరాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, పార్టీ నాయకులు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, నర్సింలు నాయుడు, రాములు, రవిగౌడ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లు క్యాన్సర్ కారకాలు



క్యాన్సర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

తాండూరు టౌన్: జీవనశైలి, దురలవాట్లు క్యాన్సర్‌కు కారకాలుగా మారుతున్నాయని క్యాన్సర్ నిపుణులు డాక్టర్ సీఎన్ శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, యువ జాగృతి సంస్థల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. శరీరంలో ఏర్పడే మార్పులను జాగ్రత్తగా గమనించాలన్నారు. పొగాకు, గుట్కా, కాలుష్యం, కల్తీ ఆహార పదార్థాలు క్యాన్సర్‌కు కారణమవుతున్నాయన్నారు. క్యాన్సర్ వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. నొప్పి లేని చిన్న కణుతుల విషయంలో జాగ్రత్త పడాలన్నారు. సకాలంలో వైద్యున్ని సంప్రదించాలని, క్యాన్సర్ బారిన పడితే కీమోథెరపి, రేడియో థెరపితో పాటు పలు రకాల చికిత్సల ద్వారా క్యాన్సర్‌ను నయం చేయొచ్చన్నారు. అనంతరం ప్రజలు పలు సందేహాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మాజీ కౌన్సిలర్ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్‌పై ఎన్నో అనుమానాలున్నాయన్నారు. ఇలాంటి ప్రజోపయోగ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఐఎంఏ, యువజాగృతి సభ్యులను అభినందిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఐఎంఏ తాండూరు అధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్, యువజాగృతి అధ్యక్షులు పర్యాద రామకృష్ణ పేర్కొన్నారు.

శిలాఫలకంలో పేర్లు లేవని..

బ్యాంకు ప్రారంభ కార్యక్రమంలో నాయకుల ఆందోళన



కార్యక్రమ ప్రారంభంలో వైస్ చైర్మన్ పేరు లేకుండా శిలాఫలకం

యాలాల: మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్‌లో బుధవారం హెచ్‌డీసీసీబీ శాఖ బ్యాంకు ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పేర్ల రగడ నెలకొంది. బ్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో తన పేరు లేకపోవడంపై యాలాల సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు మండిపడ్డారు. ఈ విషయంలో అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికితోడు వైస్ చైర్మన్ ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడు కావడంతో ప్రారంభోత్సవంలో గొడవ జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు, బ్యాంకు అధికారులు వైస్ చైర్మన్‌కు నచ్చజెప్పారు. శిలాఫలకంపై తాత్కలికంగా పేరు ఏర్పాటుకు వైస్ చైర్మన్‌ను ఒప్పించారు. ఆయన పేరుపై కొత్త స్టిక్కర్ కోసం బ్యాంకు సిబ్బందిని తాండూరుకు పంపించారు. అప్పటికే ఎమ్మెల్యే లక్ష్మీనారాయణపూర్ రావడానికి సిద్ధమయ్యారు. స్థానిక నాయకులు ప్రొటోకాల్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన 20 నిమిషాల తరువాత కార్యక్రమానికి హాజరయ్యారు.

బ్యాంకు పరిధి అగ్గనూరు గ్రామానిది..

శిలాఫలకంలో తన పేరు లేదని వైస్ చైర్మన్ ఆగ్రహం చేసిన సమయంలో అగ్గనూరు గ్రామానికి చెందిన కొందరూ నాయకులు అక్కడికి చేరుకున్నారు. డీసీసీబీ బ్యాంకు అగ్గనూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేశారని, బ్యాంకు బోర్డుపై తమ గ్రామం పేరు ఉండాలని పట్టుబట్టారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎమ్మెల్యే గ్రామస్తులకు నచ్చజెప్పారు. ఆర్‌బీఐ నుంచి వచ్చిన అనుమతి పత్రాల్లో బ్యాంకు చిరునామాలో లక్ష్మీనారాయణపూర్ ఉందని, అయినప్పటికీ బోర్డుపై అగ్గనూరు పేరు కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కాగా ప్రొటోకాల్, ఊరిపేరు అంశం బ్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో చర్చనీయాంశంగా మారింది.

సీఎం సొంతూరు నుంచి పాదయాత్ర చేస్తాం

కొడంగల్: వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి నుంచి ఆయన ప్రాతినిద్యం వహిస్తున్న కొడంగల్ వరకు వందలాది మంది వికలాంగులతో పాదయాత్ర చేస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వికలాంగులకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు అవకాశం ఇవ్వాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

చర్యలు తీసుకోవాలి

పూడూరు: ఫెన్సింగ్ తొలగించి భూ ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వికారాబాద్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పట్టదారుడు సతీష్‌అగర్వాల్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మేడికొండ రెవెన్యూ పరిధిలో 102 సర్వే నంబర్‌లో 10-26 ఎకరాల భూమిని తాము ఆరేళ్ల క్రితం కొనుగోలు చేశామని తెలిపారు. అప్పటి నుంచి తామె కబ్జాలో ఉండి చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నామని తెలిపారు. బుధవారం చీలాపూర్ గ్రామానికి చెందిన వడ్డె యాదయ్య, శ్రీను, వడ్డె హన్మంత్, కాశీనాథ్, జంగయ్య, నర్సింలు, జియాఖాన్ దౌర్జన్యంగా ఫెన్సింగ్‌ను తొలగించి ట్రాక్టర్‌తో భూమిని దున్నారని తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించుకుని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు తమ భూమిలోకి అక్రమంగా వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పూడూరు: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గంగారానికి చెందిన కుర్వ స్వరూప (36) తన కుమారుడు అఖిలేష్‌తో మన్నేగూడ విస్‌డం స్కూల్ వద్ద ఆటోలో ఎక్కే క్రమంలో వెనుక నుంచి వస్తున్న కారు స్వరూపను బలంగా ఢీ కొట్టింది. దీన్ని గమనించిన స్థానికులు హైదరాబాద్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుటుంబీకులు అవినాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రత్యేక ప్రార్థనలు

సాక్షి, సిటీబ్యూరో: వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ ఆధ్వర్యంలో మసాబ్‌ట్యాంక్‌లో మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు రాష్ట్రం నలుమూలల నుంచి కారు, బైక్ ర్యాలీలతో ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బిల్లు ఉపసంహరించుకునే వరకు వెనక్కి తగ్గేదే లేదని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు.

ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోరా?



ఫుట్‌పాత్‌పై నిర్మించిన పిల్లర్

పరిగి: ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. రోడ్డుపై అక్రమంగా పిల్లర్ ఏర్పాటు చేస్తున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరించడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి కట్టడం చేపట్టిన చర్యలు తీసుకుంటామని చెప్పే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్‌లోని కొత్తగా ఏర్పాటు చేస్తున్న హెచ్‌డీఎఫ్ బ్యాంకు ఎదుట ఇంటి యజమాని అక్రమంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి పిల్లర్‌ను ఏర్పాటు చేశారు. పాదచారులు నడవాల్సిన స్థలంలో పిల్లర్‌ని ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఇల్లు నిర్మించేటప్పుడు సెట్‌బ్యాక్ తీసుకోకపోతే పనులను ఆపివేసే మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అక్రమనిర్మాణాలపై ఉన్నత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అనుమతుల పేరిట అడ్డగోలు ఇసుక రవాణా

అధికారుల తీరుపై మండిపడుతున్న గ్రామస్తులు



సాయంత్రం 6.30గంటలు దాటిన కూడా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

యాలాల: అనుమతుల పేరిట తీసుకున్న ఇసుక రవాణాను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో యాలాల గ్రామస్తులు మండిపడుతున్నారు. బుధవారం గోవిందరావు పేట నుంచి తాండూరుకు ఇసుక తరలింపునకు యాలాల రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారు. కాగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒక్కో ట్రాక్టరుకు నిర్దేశించి ట్రిప్పులను వివరిస్తూ అనుమతి పత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో అనుమతులు పొందిన ఇసుక ట్రాక్టర్లు ఉదయం 7 గంటలకే కాగ్నా వాగులోకి వెళుతున్నాయని, సాయంత్రం 7గంటల వరకు ఇసుక రవాణా చేస్తున్నారని యాలాల మాజీ ఉపసర్పంచ్ గొల్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయమై యాలాల తహసీల్దార్‌కు ఫోన్లో ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఇసుక రవాణా విషయంలో రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

వైభవంగా భద్రేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలలో పల్లకీ సేవను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు పటేల్ కిరణ్‌కుమార్

తాండూరు టౌన్: శ్రీభావిగి భద్రేశ్వర జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పటేల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాలకు నాయకులు ప్రజా ప్రతినిధులు భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో శోభయాత్ర నిర్వహించారు. పురంతయ్యల విన్యాసాలు, విద్యార్థుల నృత్యాల మధ్య కోలాహలంగా మొదటి రోజు నిర్వహించారు. మొదటి రోజు ఆలయం నుంచి గాంధీచౌక్, రాచన్న దేవాలయం వరకు పల్లకీ సేవ నిర్వహించారు. వీరశైవ సమాజం సభ్యులు పెద్ద ఎత్తున చేరుకొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలలో తాండూరు పట్టణ సీఐ సంతోశ్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు.



ఉత్సవాలలో పురంతయ్య విన్యాసం